పేదల చెంతకే వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన
- 53వ వార్డులో 458 మందికి ఉచిత వైద్య సేవలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల వైద్యానికి ఎంతో భరోసా ఇస్తోంది. బుధవారం జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ శిబిరాన్ని పరిశీలించి బీపీ చెక్ చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకొచ్చారన్నారు. ఆరోగ్య సేవలతోపాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో సాధారణ వైద్యం, డెర్మటాలజీ, నేత్ర, గైనిక్ వంటి స్పెషలిస్ట్ డాక్టర్లు



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుంటున్న పేషెంట్లు

పాల్గొని స్థానికులకు వైద్యం అందించారు. సాధారణ వైద్యానికి 187 మంది, గైనకాలజీకి 67 మంది, చర్మవ్యాధులకు 84 మంది, నేత్ర వైద్యం కోసం 120 మంది రోగులు, మొత్తంగా 458 మంది వచ్చి వైద్య సేవలు పొందారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుండెకు సంబంధించి ఒకరిని, కంటి వెలుగుకు సంబంధించి ఐదుగురిని రిఫరల్ చేసినట్టు ఆరోగ్య కేంద్రం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’తో ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యూపీహెచ్‌సీల ద్వారా ప్రజలకు అనేక రకాల వైద్యం అందిస్తున్నారు. ఇప్పుడు ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి పేదల వైద్యానికి ఎంతో మేలు చేస్తోంది ఈ ప్రభుత్వం. నా కాళ్ల నొప్పులకు వైద్య శిబిరంలో డాక్టర్ తనిఖీ చేసి మందులు రాసి ఉచితంగా ఇచ్చారు. నా కుటుంబ సభ్యులు కూడా ఈ ఆరోగ్య కేంద్రానికే వచ్చి వైద్యం చేయించుకుంటారు.

– కె.వసంతరావు, శివనగర్

అభివృద్ధి పనుల జోరు



అబిద్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అబిద్‌నగర్‌లో రూ.38.46 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ధాన్ ఫౌండేషన్ కోసం నిర్మించిన సామాజిక భవనం, పునర్నిర్మించిన జిమ్ భవనాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హబీబ్, మహదాస్యం గోపి, సీతారాం, జి.వెంకటరావు, బషీర్, ప్రకాష్, ప్రసాదు, వెంకట్, ధాన్ ఫౌండేషన్ సీవో మురళి, ధాన్ ఫౌండేషన్



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల

సభ్యులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయలతో ‘కొండవాలు’ అభివృద్ధి



సంజీవయ్య కాలనీలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు



శ్రామికనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ, బాబు జగ్జీవన్‌రామ్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. రూ.88.45 లక్షలతో సామాజిక భవనం ఆధునికీకరణ, సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు ఈఈ మత్స్యరాజు తెలిపారు. కార్యక్రమంలో గురువోజీ, అప్పారావు, కృప, సురేష్, కనకరాజు, చందు, సాయి, వాసు, రమేష్, నర్సింగరావు, రామారావు, ప్రభుదాస్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

46వ వార్డులో భూమిపూజ

జీవీఎంసీ 46వ వార్డు శ్రామికనగర్ కొండవాలు ప్రాంతంలో మెట్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు మరమ్మతులకు బుధవారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ భూమిపూజ చేశారు. సుమారు రూ.10 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు ఏఈ ఉమామహేశ్వరరావు తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మరో రూ.9 కోట్ల నిధులు మంజూరైనట్లు కటుమూరి సతీష్ చెప్పారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు అప్పారావు, రామారావు, గోవింద్, కృష్ణ, రాజు, నారాయణరెడ్డి, రమణ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమాజాన్ని నడిపించేది సాహిత్యం



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

సీతంపేట: సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేది సాహిత్యమని నవసాహితి ఇంటర్నేషనల్(చెన్నై) అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాహిత్యం ప్రతి ఒక్కరికీ అవసరమని, అది హృదయానికి సంబంధించినదన్నారు. మానవ సంబంధాలు, అనుబంధాలకు సాహిత్యం వారధి అని పేర్కొన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో సాహిత్యం ముఖ్య భూమిక పోషిస్తూ జనుల్లో విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. డాక్టర్ కె.జి.వేణు బంగ్లాదేశ్ కవి రచయిత ఖాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం, జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ, డాక్టర్ డి.వి.సూర్యారావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, వెలమల సిమ్మన్న, కె.వి.ఎస్.మూర్తి, కె.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్ క్వార్టర్స్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్‌ల్లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మద్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని పాఠశాల రహదారి, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, రైల్వే క్వార్టర్స్, మద్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్లవీధి, రానాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్, భారత్ పెట్రోలియం బంక్ లైన్, రామాలయం వీధి, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రూరల్ తహసీల్దార్‌గా శివన్నారాయణ



ఆరిలోవ: రూరల్ మండలం తహసీల్దారుగా ఎస్.శివన్నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంత వరకు తహసీల్దారుగా పని చేసిన సనపల రమణయ్య విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈయన రూరల్ మండలం నుంచి రిలీవైన రోజే హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ముందుగా కొత్తవలస తహసీల్దారు మిశ్రాను బదిలీ చేశారు. రమణయ్య హత్య సంఘటనతో మిశ్రా ఇక్కడికి రావడానికి ఆసక్తి కనబరచలేదు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తహసీల్దారు ఎస్.శివన్నారాయణను ఇక్కడికి బదిలీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన



అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: రానున్న ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.అఖిల తెలిపారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వాటి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో బూత్‌ల వద్ద ఓటు వేయకుండా అడ్డుకున్న వారిపై, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన వారిపై కేసులు ఉంటే తక్షణమే వారి వివరాలు సేకరించాలని పోలీసులకు ఆదేశించారు. ఉత్తర నియోజకవర్గంలో 272 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 17 మంది సెక్టార్ అధికారులను నియమించామని, 75 లోకేషన్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఓటర్ల జాబితాల్లో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. 18 ఏళ్లు దాటిన వారు ఓటర్ లిస్టులో లేకపోతే నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ జాబితా పారదర్శకంగా ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్, జీవీఎంసీ అధికారులు ఏడీ సూర్యప్రకాష్, ఈఈ జి.సత్యనారాయణ, కె.నీరజ, పి.శ్రీరామమూర్తి, వి.విజయలక్ష్మి, వి.రామకృష్ణ, ఏడుకొండలు, సుధాకర్, వెంకటేశ్వరరావు, భరణికుమార్, పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలకు దిశానిర్దేశం



26వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



49వ వార్డు బీఎల్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని జయలక్ష్మి ఫంక్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం బూత్ లెవల్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బొడ్డేటి కిరణ్, రేవతిరావు, శేషు, గండ్రేటి రవిబాబు, నవాబ్, అమ్మాజి, గౌస్య, బాబ్‌జాన్, సుశీల, విజయ్ పాల్, ప్రకాష్, ఫరూఖ్, వెంకటరావు, ఈశ్వరరావు, విజయలక్ష్మి, పద్మ, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు ఆధ్వర్యంలో బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలిచ్చారు. జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీశ్, నీలి రవి, డైరెక్టర్లు ఎన్.రవికుమార్, పాండవ శ్రీను, ఐ.రవికుమార్, సీనియర్ నాయకులు బొడ్డేటి కిరణ్, రేవతిరావు, శేషు, గండ్రేటి రవిబాబు, నవాబ్, అమ్మాజీ, గౌస్య, బాబ్జాన్, సుశీల, విజయ్ పాల్, ప్రకాష్, ఫరూక్, వెంకటరావు, ఈశ్వరరావు, విజయలక్ష్మి, పద్మ, వార్డు సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లలితా పీఠంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: బహుళ ద్వాదశి సందర్భంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పూజలు చేశారు. హోమంలో పాల్గొన్న వారికి ప్రతికూల ప్రభావం నుంచి విముక్తి లభించడం, శత్రువులపై విజయం సాధిస్తారని వేద పండితులు తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా గురువారం కాశీ కాలభైరవులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డుపై స్పృహ తప్పి పడిపోయిన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సాయిబాబా, సంతోషీమాత ఆలయం సమీపంలో సుమారు 60 ఏళ్ల వయసు గల ఓ వ్యక్తి మంగళవారం రోడ్డుపై పడిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించి 108కు ఫోన్ చేశారు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అతడి ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. సదరు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని, లేదా మార్చురీలో ఉన్న వ్యక్తి సంబంధించిన వారైతే నేరుగా మృతదేహాన్ని చూసి సమాచారమివ్వాలని పోలీసులు కోరారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టారు.

తనిఖీల్లో 84 వాహనాల సీజ్



ద్వారకా, ఫోర్త్‌టౌన్ పీఎస్‌ల ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్వారకా పీఎస్ పరిధిలో సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ధర్మేంద్ర, ఆర్ఐల నేతృత్వంలో గురుద్వారా, సీతంపేట దుర్గాగణపతి ఆలయం, ఆశీలమెట్ట, ద్వారకానగర్, రామాటాకీస్, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్, సైలెన్సర్లు, పత్రాలు, మద్యం తాగిన నడిపిన 62 వాహనాలను సీజ్ చేశారు. ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలోని దొండపర్తి, డైమండ్ పార్కు, అక్కయ్యపాలెం హైవే తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 22 వాహనాలను సీజ్ చేశారు. దీంతో ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఆవరణ ద్విచక్ర వాహనాలతో నిండిపోయింది.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



విద్యార్థిని దంతాలు పరీక్షిస్తున్న డాక్టర్ అమృత

సీతమ్మధార: రోటరీ క్లబ్ విశాఖపట్నం, స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో బుధవారం పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ పి.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం(కార్డియాలజిస్ట్) డెంటల్ డాక్టర్, అమృత విద్యార్థుల దంతాలను పరీక్షించి, ఇతర ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం శస్త్రచికిత్సలు అవసరమయ్యే పిల్లలకు దాతల ద్వారా ఉచితంగా సేవలందించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 103 మంది నమోదు



ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మురళీనగర్: టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీ బుధవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 103 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్ష రాశారని, ఇందులో ఎంపికైన వారికి ఈ నెల 13న మౌఖిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి ఆ సంస్థలో నెలకు రూ.25,000 జీతంతో ఆరు నెలల ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. అనంతరం రూ.8.6 లక్షల వార్షిక ప్యాకేజీ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

భవన నిర్మాణాలపై 1 శాతం సెస్ చెల్లించాలి

సీతంపేట: విశాఖ జిల్లాలోని అన్ని కన్‌స్ట్రక్షన్ యూనిట్లు, భవనాల నిర్మాణానికి వెచ్చించే వ్యయంలో 1 శాతం సెస్ రూపంలో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని భవన, ఇతర నిర్మాణాలు చేపట్టే యజమానులు తమ నిర్మాణాలను ఎస్టాబ్లిష్‌మెంట్ రూపంలో సమీప మీ సేవా, లేదా వార్డు సచివాలయంలో గాని, మీ సేవా పోర్టల్‌లో గాని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఫారం సీ రూపంలో రిటర్న్ కార్మిక శాఖ సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మిక చట్టం 1996 ప్రకారం భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు హెల్మెట్‌లు, రక్షణ గ్లౌజ్‌లు, ఎత్తులో పనిచేసే వారు కింద పడిపోకుండా కాపాడే యంత్ర సదుపాయం కల్పించాలని చెప్పారు. జిల్లాలోని దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు తమ సంస్థలను ఈ నెల 29లోగా సమీప మీ సేవా కేంద్రంలో గాని, వార్డు సచివాలయంలో గాని రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ పూర్తి చేయాలని తెలిపారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ స్పష్టం చేశారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. దొండపర్తి, నెహ్రూ బజార్, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎస్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పలు రకాల పూలతో ఎరుకుమాంబను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి చీరల వేలం

ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లను ఈ నెల 8, 15 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలం వేస్తామని ఆలయ ఈవో రమాబాయి, చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని కోరారు.

ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న మెట్ట రామారావు

సీతంపేట: ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో ఉత్తరాంధ్ర ఆత్మగౌరవం పేరుతో యాత్ర ప్రారంభించినట్లు ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మెట్ట రామారావు తెలిపారు. అక్కయ్యపాలెం శాంతిపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 వరకు 23 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర పార్టీ 53 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని, తమ అభ్యర్థుల గెలుపుతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో బిల్లు పెట్టడం ద్వారా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోగలమన్నారు.

అక్కయ్యపాలెం పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమైన యాత్ర కూర్మన్నపాలెంలో జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమ శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపింది. అనంతరం తుని, కాకినాడ, అమలాపురం, ధవళేశ్వరం జగ్గంపేట తదితర ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగించి ఈ నెల 29న విశాఖ చేరుకుంటుంది.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి.